

# కొడుకులు

— మంత్రవాది

“బాబు గారూ...! నేనేమిటి?..నా స్థితేమిటి? ఈ వయసులోనా? ఇరవై ఐదేళ్ళ క్రితం జరగాల్సిన ముచ్చట ఆనాడు పీటల మీదే ఆగిపోయింది. మళ్ళీనా..! వద్దు బాబుగారూ వద్దు!!” అంటూ రెండు చేతులు జోడించి నమస్కరించింది శ్యామలమ్మ.

ఇద్దరి మధ్యా చాలాసేపు మౌనం రాజ్యమేలింది. రామచంద్రయ్య ఆమె వంక చూస్తూ—

“ఏ పిల్లల కోసం నా భార్య చనిపోయింతర్వాత మళ్ళీ పెళ్ళి చేసుకోలేదో....వాళ్ళు ఆస్తులు పంచుకుని నన్ను ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయారు. ఈ చరమ దశలో మీ నుంచి నేను కోరుకునేది ఆత్మ బంధుత్వం. నాకు తోడు కావాలి” అన్నాడు.

“బాబు గారూ! మీరు దురుద్దేశంతో అడుగుతున్నారని నేను అనుకోవడం లేదు. మీరు పెద్దవారు. అన్నీ తెలిసున్నవారు. ఒక్కసారి నా వైపు ఆలోచించండి. ఈ ప్రపంచం నన్ను కాకిలా పొడుచుకు తింటుంది. పైగా మీ పిల్లల వైపు నుంచి వచ్చే సమస్యలు మునిద్దరం ఎదుర్కోవలసి వస్తుంది”.

“చూడండీ! వాళ్ళు ఏనాడో రావలసింది తీసుకుని తెగ తెంపులు చేసుకుని వెళ్ళిపోయారు. ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా వచ్చి చూసి వెళ్ళలేదు” రామచంద్రయ్య గొంతులో ఆవేదన ధ్వనించింది.

“వాళ్ళు మీ రక్తం పంచుకు పుట్టినవాళ్ళు”.

“అదే వాళ్ళలో వుంటే పెళ్ళాల మాటలు పట్టుకుని నన్ను ఒంటరి వాణ్ణి చేసి వెళ్ళిపోయి వుండేవాళ్ళే కాదు. అయినా ఇంకా వాళ్ళ గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఒక్కసారి మీరు ఆలోచించండి. ఏం ఫరవాలేదు. తాపీగానే ఆలోచించి మీ నిర్ణయాన్ని తెలియజేయండి” అన్నాడు.

“వస్తాను బాబుగారూ!”

“శ్యామలమ్మ గారూ! మీ నిర్ణయంతో నా చరమ దశ ముడిపడి వుంది. బాగా ఆలోచించుకుని ఓ నిర్ణయానికి రండి”.

శ్యామలమ్మ ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

*** *** ***

రామచంద్రయ్య ముగ్గురు కొడుకులూ మౌనంగా వున్నారు. తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడన్న వార్త వాళ్ళని కలవరపెడుతోంది. తండ్రి రిటైరయ్యేంతర్వాత వస్తాయనుకున్న నాలుగు లక్షలూ వాళ్ళని వెక్కిరిస్తున్నాయి.

‘ఏమిటండీ! ఇంకా ఆలోచిస్తున్నారూ? ఏది ఏమైనా సరే! ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు. అదే గనక జరిగితే అంతో ఇంతో వస్తుందనుకున్న కాస్తా ఆ వచ్చేది తన్నుకుపోతుంది” రామచంద్రయ్య పెద్ద కోడలు అరుంధతి వురిగొల్పుతోంది.

“అవునొదినా! నువ్వు చెప్పింది నిజం” రామచంద్రయ్య మూడో కొడుకు సూర్యం అరుంధతిని సపోర్ట్ చేస్తూ · అన్నాడు.

అప్పటి వరకూ మౌనంగా కూర్చున్న రెండో కొడుకు మోహన్

"ఈ పరిస్థితి రావడానికి కారణం మనమే. ఆయన ఎంత చెప్పినా వినకుండా ఆస్తులు పంచుకుని తెగ తెంపులు చేసుకొచ్చిన వాళ్ళం. అయినా ఏం చేయాలో మీరే నిర్ణయించుకోండి. ఈ విషయంలోకి నన్ను లాగొద్దు" అంటూ లేచి వెళ్ళిపోయాడు.

"రేపు అనుకున్నది అనుకున్నట్టు జరిగినప్పుడు వాటాకొస్తే అప్పుడు చెబుతా పీడి పని. ఏరా తమ్ముడూ! ఏం చేద్దామనుకుంటావ్?" రామ చంద్రయ్య పెద్ద కొడుకు దాశరథి అడిగాడు సూర్యాన్ని.

"ఏం చేసేదేముంది? ఇంటికెళ్ళి కడిగి పారేయడమే! కుటుంబ గౌరవం, పరువు ప్రతిష్ఠలు మంటగలిసి పోతుంటే చూస్తూ ఎలా వూరుకోగలం? అయినా ఆ ముదనష్టపుది ఆయనకెక్కడ దాపురించిందో?" సూర్యం ఆవేశంగా అన్నాడు.

"ఎక్కడేమిటి? హైదరాబాద్‌లో ఏదో పెళ్ళిలో తారసపడిందట ఆ వంటలక్క" మెటికలు విరుస్తూ అంది అరుంధతి.

"ఏంటే? వంటలు చేసుకునే! ఈ విషయం నీకెలా తెలుసు?" అడిగాడు దాశరథి.

"బావుంది లెండి సంబడం! అవన్నీ తర్వాత. ముందు పెళ్ళి ఆగిపోయే మార్గం గురించి ఆలోచించండి".

ముగ్గురూ బాగా ఆలోచించుకుని తండ్రింటికే వెళ్ళి తేల్చుకుందామని నిర్ణయానికొచ్చేశారు.

*** *** ***

రామచంద్రయ్య అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఆయనకి ఏమీ తోచడం లేదు. శ్యామలమ్మ కోసం ఎదురు చూస్తున్నాడు. తన చివరి జీవితపు కష్ట సుఖాలని పంచుకుంటానని మాట ఇచ్చిన ఆమె ఒక నూతన శకానికి నాంది పలికింది.

అంతలో గుమ్మంలోకి వచ్చిన శ్యామలమ్మను చూసిన రామచంద్రయ్య కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"రండి! మీ కోసమే ఎదురు చూస్తున్నాను. అన్ని విషయాలూ మాట్లాడేశాను. వచ్చే గురువారం హంగులూ, ఆర్భాటాలూ లేకుండా రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి.

"బాబూ గారూ! మీ ఇష్టమే నా ఇష్టం. మీకు ఏది సంతోషం అనుకుంటే అదే చేయండి" అని తల వంచుకుంది కొంచెం సిగ్గుతో.

"ఏమిటీ సిగ్గు పడుతున్నారా?" అన్నాడు.

అప్పుడే వచ్చిన దాశరథీ, సూర్యం రామచంద్రయ్య మాటలకి బాగా రియాక్టయ్యారు.

"సిగ్గు లేకపోతే సరి! ఈ వయసులో సిగ్గు పడ్డానికి" అన్నాడు సూర్యం.

"ఎవరికిరా సిగ్గు లేంది? పిలవని పేరంటానికి వచ్చిన కు సిగ్గు లేదు. నా మానాన నన్ను విడిచి పెట్టి వెళ్ళిపోయిన మీకు లేదు సిగ్గు" రామచంద్రయ్య కోపంగా అరిచాడు. ఆయన కళ్ళు ఎర్రబడ్డాయి.

"వాడో అన్నాడని అంతలా మాట్లాడుతున్నావ్. ఈ వయసులో నీకిదేం పాడు బుద్ధి?" అన్నాడు దాశరథి.

"రేయ్! ఎక్కువగా మాట్లాడకు. మర్యాద కాపాడుకో".

"బాబు గారూ! వూరుకోండి" అంది శ్యామలమ్మ.

"మర్యాద కాపాడుకోవడం కోసమే వచ్చాం. మా పరువూ, మర్యాదలు నువ్వు ఈ పెళ్ళితో మంట గలపాలనుకుంటున్నావ్. రేపు మేం నలుగుర్లో తలెత్తుకుని తిరగలేం. ఆయానా నిన్నని ఏం లాభం? దీన్ననాలి. ఆయనకి లేకపోతే నీకు..నీకుండక్కర్లేదా? ఈ వయసులో తగుదునమ్మా అంటూ పెళ్ళికి తయారై కూర్చున్నావ్. నీకు మా నాన్నే దొరికాడా?" హూంకరించాడు దాశరథి.

మౌనంగా తిట్లు భరిస్తోంది శ్యామలమ్మ.

"చూడూ! ఆవిడనేమైనా అన్నావంటే బావుండదు. అయినా ఎవర్రా నీకు నాన్న? ఆ బంధాన్ని తెంచుకుని వెళ్ళిపోయారే! అప్పుడేమైందిరా ఈ బంధం? ఇవాళ రిటైరయ్యాం తర్వాత నాలుగు డబ్బులు కనిపించేసరికి మళ్ళీ నాన్న కావల్సొచ్చాడు. పొండ్రా! ఇది నా స్వార్జితం. నా జీవితం. నా ఇష్టం. ఏం చేసుకుంటారో పొండి! చేతనైంది చేసుకోండి. శ్యామలమ్మా! మీరు ఇవేం పట్టించుకోవద్దు. అవును ఇందాక మీతో రిజిస్టర్ మ్యారేజ్ అని చెప్పాను కదూ! లయన్స్ కల్యాణ మండపం బుక్ చేసి గ్రాండ్‌గా ఏర్పాటు చేస్తాను. అందర్నీ పిలుస్తాను" చాలా దృఢంగా చెప్పాడు రామచంద్రయ్య.

"ఈ పెళ్ళే జరిగితే నువ్వూ, అదీ బ్రతకరు" చాలా ఆవేశంతో వార్నింగిచ్చాడు సూర్యం.

"ఏం చేస్తావురా? చంపుతావా..ఊ..చంపు. కొత్త చరిత్ర సృష్టించు. 'అపుత్రస్య గతిర్నాస్తి' అని ఉపనిషత్తులు చెబుతుంటే మీరు 'పుత్రస్య గతిర్నాస్తి' అని నవభాష్యం చెప్పారు. పుత్రోత్సాహం తండ్రికి పుత్రుడు జన్మించినప్పుడే పుట్టదు జనులా..అంటే ఇదేనేమో" అన్నాడు వేదాంత ధోరణిలో.

ఇద్దరూ మరోసారి వార్నింగిచ్చి వెళ్ళిపోయారు.

*** *** ***

లయన్స్ కల్యాణ మండపం అలంకరణతో చాలా అందంగా కనిపించింది. జనంతో చాలా హడావిడిగా వుంది. రామచంద్రయ్య గారి బంధువులూ, కావలసిన వాళ్ళు చాలామంది వచ్చారు.

అదే సమయంలో దాశరథీ, అరుంధతీ, మోహన్, సరిత లోపలికి రావడం చూసిన శ్యామలమ్మ రామచంద్రయ్యకు కళ్ళతో సైగ చేసింది.

రామచంద్రయ్య ఆశ్చర్యంగా చూశాడు.

"మీరంతా చదువుకున్న వాళ్ళు. ఆయన ఈ వయసులో తప్పు చేస్తుంటే మీరు చూస్తూ కూరచోవడం ఏమీ బావుండలేదు. దయచేసి మేం చెప్పేది కాస్త వినండి" అన్నాడు సూర్యం.

రామచంద్రయ్య దగ్గర చదువుకున్న ఒక స్టుడెంటు లేచి–

'చూడు బాబూ! రామచంద్రయ్య గారు తప్పు చేయరు. ఆయనే తప్పు చేస్తే మీరు ఏనాడో శంకరగిరి మాన్యాలు పట్టి పోయేవాళ్ళు" అన్నాడు.

"నువ్వేంట్రా? పెద్ద పోజూ.." అనాడు సూర్యం ఉక్రోషం పట్టలేక.

"రేయ్! నీకు ఇంట్లో పెళ్ళాం వున్నా...ఎంగిలి కూటి కోసం ఎంత మంది చేత చీవాట్లు తిన్లేదు...రోజా...అనిత. .." లిస్టు ఏకరువు పెడుతున్నాడా స్టూడెంటు.

దాంతో సూర్యం భార్య సరిత సూర్యాన్ని కొరకొరా చూసింది.

"మాస్టారూ! మీరు కానివ్వండి. వీరిద్దరూ వారి కొడుకులు. వారు కోడళ్ళు. ఒంటరివాణ్ణి చేసి ఆస్తులు పంచుకుపోయారు. మాస్టారు ఇవాళ తోడు కోసం పెళ్ళి చేసుకుంటుంటే బురద చల్లడానికి ప్రయత్నిస్తున్నారు. మర్యాదగా మీరు ఈ పెళ్ళి చూసి వెళ్ళిపోండి. లేకపోతే దేహశుద్ధి జరుగుతుంది" అంటూ హెచ్చరించాడా పూర్వ విద్యార్థి.

మంగళ వాద్యాల మధ్య వేదోక్తంగా రామచంద్రయ్యకి తోడై, నీడై నిలబడింది శ్యామలమ్మ. రామచంద్రయ్య కొడుకులూ, కోడళ్ళూ అక్కడి నుంచి ఉడాయించారు. మాస్టారికి ఆ స్టూడెంటు ఆ రకంగా గురుదక్షిణ చెల్లించుకున్నాడు.